క్లుప్తంగా

మల్లయోధులకు బహుమతులు



నిజాంసాగర్(జుక్కల్) : వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మల్లయోధుల కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. చుట్టు పక్క మండలాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కండలు తిరిగిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో తలపడ్డారు. కుస్తీపోటీల్లో విజేతలకు నిర్వాహకులు నగదును బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో కుస్తీ పోటీల నిర్వాహకులు ఏలే మల్లికార్జున్, సందీప్, లింగాగౌడ్, బేగరి రాజు, నరేశ్, రాములురాథోడ్ తదితరులున్నారు.

నేడు కుస్తీ పోటీలు

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో సోమవారం మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక నాయకుడు ప్రజాపండరి తెలిపారు. నల్లపోచమ్మ ఉత్సవాల్లో భాగంగా మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని గడి వద్ద వేంకటేశ్వర ఆలయం నుంచి తిమ్మానగర్ రోడ్ వరకు సీసీ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 10 లక్షల ఎన్ఆర్‌జీఈజీఎస్ నిధులతో ఈ సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, మోహన్ రెడ్డి, శివ, గంగారం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ కల్యాణోత్సవం



కామారెడ్డి అర్బన్ : సువర్చలా సహిత హనుమాన్ ఆలయం భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతూ దినదినాభివృద్ధి చెందుతుందని వేదపండితులు గంగవరం ఆంజనేయశర్మ అన్నారు. ఆదివారం కామారెడ్డి ఆర్‌బీ నగర్ శ్రీ ఇష్ట కార్య సిద్ధి ఆంజనేయ ఆలయం సప్తమ వార్షికోత్సవం, సువర్చలా హనుమత్ గోపుర శిఖర కుంభాభిషేకం, కల్యాణోత్సవం, పల్లకీసేవ, గణపతి నవగ్రహ రుద్ర మన్యుసూక్త మంత్ర యజ్ఞం, అన్నప్రసాద కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సత్యనారాయణగౌడ్, బాల్‌కిషన్, దేవాచారి, కిషన్‌గౌడ్, నిత్యనందం, ప్రభాకర్,ఎ.రాజేశ్వర్, వినోద్ తదితరులున్నారు.

ఘనంగా బీరప్ప కామరాతి విగ్రహ ప్రతిష్ఠ



భిక్కనూరు : మండలంలోని బీరప్ప–కామరాతి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుర్మ సంఘం ఆధ్వర్యంలో భాజభజంత్రీలతో పూజ సామగ్రిని ఊరేగించి ఆలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ సాగింది. కుర్మ సంఘం ఆధ్వర్యంలో బోనం ఊరేగింపును నిర్వహించిన తర్వాత ప్రతి కుర్మ కులస్తులు తమ ఇండ్లలో మైలలు తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీర్లవాళ్ల బీరప్ప–కామరతి విగ్రహాలకు ప్రత్యేక అర్చన నిర్వహించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

బిచ్కుంద(జుక్కల్) : సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నరేష్ తెలిపారు. స్కీంలో లక్కీడ్రా మీ పేరున వచ్చిందని ఏదోరూపంలో మాట్లాడి మీ బ్యాంక్ అకౌంట్, ఏటీఎం నెంబరు, ఓటీపీ, ఆధార్ నెంబరు ఇలా ఏ సమాచారం అడినా ఇవ్వవద్దని సూచించారు.

నాటుడెందుకు.. నరుకుడెందుకు..

- అభాసుపాలవుతున్న హరితహారం
- ఇష్టారాజ్యంగా చెట్ల తొలగింపు



తిమ్మాపూర్ వద్ద నరికేసిన హరితహారం మొక్క



తాడ్కోల్‌లో రోడ్డులో నరికేసిన చెట్లు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : హరిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం నీరుగారిపోతోంది. నస్రుల్లాబాద్ మండలంలోని తిమ్మాపూర్, లింగంపల్లి గ్రామాల ప్రధాన రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు కాస్తా చెట్లుగా మారాయి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వైర్ల కిందే మొక్కలు నాటించారు. దీనితో కొమ్మలు విద్యుత్ వైర్లకు తగలడంతో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీనితో సంబంధిత శాఖా అధికారులు వైర్ల కింద ఉన్న మొక్కలను నరికేశారు. వైర్ల కిందే మొక్కలు నాటడమెందుకు.. తర్వాత నరికేయడమెందుకని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తిర్మలాపూర్,తాడ్కోల్ గ్రామాల్లో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని తిర్మలాపూర్, తాడ్కోల్ డబుల్‌బెడ్‌రూం కాలనీ, కొయ్యగుట్ట, జక్కల్‌దాని తండా, ఇబ్రాహింపేట్ గ్రామాల రోడ్ల వెంబడి పదుల సంఖ్యలో మొక్కలు నరికివేతకు గురయ్యాయి. రైతులు తమ పొలాలకు ఆనుకుని ఉన్న చెట్లను ఇష్టారాజ్యంగా నరికేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో లక్షలతో చేపట్టిన హరితహారం లక్ష్యం నీరుగారిపోతోందని వారంటున్నారు. మొక్కలు కష్టపడి పెంచి.. నాటిన అనంతరం రోజూ ట్యాంకర్ల ద్వారా నీళ్లుపోస్తే కొందరు తమ పొలాలకు అడ్డుగా ఉంటున్నాయని చెట్ల ను నరికేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వేసి.. సూచిక మరిచి..



ఉప్పర్‌పల్లి నుంచి మాందాపూర్ వెళ్లే రహదారిలో సూచిక బోర్డు లేని మూలమలుపు



ఎటువంటి సూచిక బోర్డులు లేని రోడ్డు

బీబీపేట: ప్రమాదకర మలుపులు, ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనాదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. మండంలోని ఉప్పర్‌పల్లి నుండి మాందాపూర్ వెళ్లే రహదారి ఇటీవల నూతనంగా బీటీ రోడ్డు వేశారు. అయితే రోడ్డు అయితే వేశారు కాని ప్రమాద మలుపుల వద్ద సూచిక బోర్డులు పెట్టడం మరిచారు. అంతే కాకుండా ప్రమాద మలుపుల వద్ద రోడ్డుపై పూర్తిగా దుమ్ము ఉండి ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ప్రమాద మలుపుల వద్ద సూచిక బోర్డులు కనీసం ఏర్పాటు చేసిన వాహనదారులు వాటిని చూసి ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని పలువురు వాపోతున్నారు. అదే రోడ్డులో మొత్తం పదికి పైగా మూల మలుపులు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్యవైశ్య సంఘానికి ఉపాధ్యాయుడి విరాళం



నగదును అందిస్తున్న సంతోష్

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో వాసవి మాత జన్మోత్సవం సందర్భంగా మద్నూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగిశెట్టివార్ సంతోష్ ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణం కోసం రూ. 5 లక్షల నగదును అందించారు. ఈ సందర్భంగా వాసవి మాతా కన్యకాపరమేశ్వరి చిత్రపటానికి ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య భవన నిర్మాణం కోసం తన తల్లిదండ్రులు చంద్రమణి, రాములు జ్ఞాపకార్థంగా ఆర్యవైశ్య భవనం కోసం ఉపాధ్యాయుడు సంతోష్ రూ. 5 లక్షలను ఆర్యవైశ్య కమిటీ సభ్యులకు అందించారు. ఈ ఉపాధ్యాయుడు గతంలో హనుమాన్ ఆలయం కోసం రూ. 5 లక్షలు, పాపమ్మ దేవి ఆలయానికి రూ. 3 లక్షలు అందించారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సాయం ఎల్లప్పుడు చేస్తానని సంతోష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు యోగేశ్, ఆర్యవైశ్యులు సతీష్, రాజేశ్, అరవింద్, అజయ్, పవన్, హన్మాండ్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కోడిచిర శివారులో విరిగిపడిన విద్యుత్ స్తంభం



కోడిచిరలో వంగిపోయిన స్తంభం

మద్నూర్(జుక్కల్) : భారీ ఈదురుగాలులకు వారం రోజుల కిందట విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు తెగి పడిన ట్రాన్స్‌కో అధికారులు ఇంత వరకు స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశిస్తే రైతులే బాగు చేసుకోవాలని అంటున్నారని వారు వాపోయారు. మండలంలోని కోడిచిర శివారులోని వ్యవసాయ పొలాల్లో గత వారం రోజుల క్రితం భారీగా వీచిన ఈదురుగాలులతో 11 కేవీ లైన్ విద్యుత్ వైర్లు తగిపోయాయని, స్తంభాలు నెలకొరిగాయని గురువారం రైతులు తెలిపారు. కాని ఈ విషయమై ట్రాన్స్‌కో అధికారులకు చెప్పిన ఇంతవరకు కన్నెత్తి చూడలేదని వారు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో బోరు మోటార్లకు కనెక్షన్ కట్ అయ్యిందని ఇదే అదనుగా భావించి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లవచ్చని వారు భయాందోళన చెందుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌లలో ఆయిల్, కాపర్ వైర్ చోరీకి గురైతే ఎవరు బాధ్యులని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాలినా పట్టించుకోరా..?



దేమికలాన్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని దేమికలాన్ శివారులో ఉన్న 153 సర్వే సర్వే నంబర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులు గడుస్తున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌పార్మర్ కాలిపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. వ్యవసాయ బావుల్లో నీరు ఉన్నప్పటికీ కరెంటు సరఫరా కాకపోవడంతో పంటలకు నీరు అందించలేకపోతున్నామని వారు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ క్రింద ఉన్న రైతులు అధికారులకు సమాచారమిస్తే రేపుమాపు అంటున్నారన్నారు. కొంత మంది రైతులు వ్యవసాయ బావుల వద్ద షెడ్లు వేసుకుని పాడిపశువులను అక్కడే కట్టేస్తున్నారు. వాటికి కూడా నీల్లులేకపోవడంతో పక్కనే బోరుబావుల నుంచి పశువులకు నీళ్లు తెచ్చి పశువులకు తాగిస్తున్నారు.

రిపేర్ చేయాలి..



దేమికలాన్ శివారులో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొందరగా రిపేరు చేసి విద్యుత్ సరఫరా చేయాలి. భూమిలో వేసిన కూరగాయ పంటలు ఎండిపోతున్నాయి. కరెంటు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వేలల్లో పెట్టి పంటలు పండించుకుంటే కరెంటు సరఫరా లేక పెట్టుబడి పూర్తిగా తుడిచి పెట్టుకు పోతోంది.

– బండారు లింగం, కౌలు రైతు

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



బాన్సువాడ : బీర్కూర్ గ్రోమోర్ దుకాణంలో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులకు గ్రోమోర్ కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేసిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి రైతులు ఘనంగా సన్మానించారు. బీర్కూర్ గ్రోమోర్ దుకాణంలో చాల మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. పొట్టదశలో వరి పంట పూర్తిగా పొల్లుగా మారి, కొంకి వ్యాధి సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులు వ్యవసాయశాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు, పోలీసులకు పిర్యాదు చేశారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి స్థానిక నాయకులు తీసుకెళ్లడంతో గ్రోమోర్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఎకరానికి రూ.20 చొప్పున రూ. 10 లక్షల 40 వేల నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేశారు.

అధ్వానంగా ఆస్పత్రి పరిసరాలు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం గోదాం రోడ్డు, బతుకమ్మ కుంట, భూపుత్రమ్మ కల్యాణమండపం ఏరియాల్లో నిత్యం చెత్త ఎత్తడం లేదని అక్కడి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో అనేక ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ ల్యాబ్‌లుండగా, కాలుష్యం వెదజల్లే అటుకులు, ప్యాలాల బట్టీలు, బతుకమ్మ కుంట మురికివాడ ఉండడంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక శద్ధ వహించి ఏరోజు చెత్త ఆ రోజు ఎత్తివేయడానికి చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకున్న వారే లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.


విద్యుత్ సిబ్బంది లేక అవస్థలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమారం గ్రామానికి కరంటు లైన్‌మన్, హెల్పర్ లేక పోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. లైన్‌మెన్, హెల్పర్లు లేక కరెంట్ పోతే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియట్లేదని వారంటున్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుందని లైన్‌మెన్, హెల్పర్లను తొందరగా కేటాయించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని కామారెడ్డిలో డీఈకి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని తహసీల్దార్ మహేందర్‌కుమార్ సొసైటీ సిబ్బందికి సూచించారు. అకాల వర్షాల కారణంగా రైతులు పండించిన ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి లారీల ద్వారా రైస్‌మిల్లులకు తరలించాలని వారు సూచించారు. రైతులు సైతం ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు కప్పి ఉంచాలని అన్నారు.

బాధితుడికి ఎల్వోసీ అందజేత



మాచారెడ్డి : పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన దాసరి విశాల్‌కు ప్రమాదవశాత్తు చేయి వేళ్లు తెగిపోయి ఆస్పత్రిలో చేరాడు. ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి రు. 2లక్షల ఎల్వోసీ ఇప్పించినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహాచారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేశారు. కార్యక్రమంలో నాయకు లు నారాయణ, లింగం, వెంకటేష్ తదితరులున్నారు.

చోరీకి గురైన ఫోన్ల అప్పగింత



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని హజ్గుల్ తాండకు చెందిన ఆకాష్, బిచ్కుందకు చెందిన సురేష్, సుల్తాన్‌పూర్‌కు చెందిన బాలాజీ ముగ్గురు కొన్ని రోజుల క్రితం వారి సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఆదివారం ఎస్సై మోహన్‌రెడ్డి వారి ఫోన్లను ట్రేస్ చేసి పట్టుకుని తిరిగి బాధితులకు అప్పగించారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

బాన్సువాడ : బీర్కూర్ మండలంలోని ఆయా సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. బీర్కూర్ మండలంలోని బీర్కూర్, దామరంచ సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలు ఉన్నాయని, బీర్కూర్‌లో 165 బస్తాలు, దామరంచలో 166 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో బస్తా 30 కిలోలు ఉంటుందని, ఎకరానికి 12 కిలోల జీలుగ వేసుకుంటే సరిపోతుందని అన్నారు.

ఆందోళన వద్దు..

ఎల్లారెడ్డి : జీలుగ విత్తనాల గురించి రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు లేవని, పర్మిట్లు ఇచ్చిన వారికి జీలుగ విత్తనాలు ఇవ్వడం లేదనే పుకార్లు నమ్మవద్దన్నారు. మొదటి విడతలో వచ్చిన జీలుగ విత్తనాలు రైతులకు ఇచ్చామని, రెండవ విడత విత్తనాలు రాగానే రైతులకు అందిస్తామని అన్నారు.

బిచ్కుందలో ఎదురుచూపులు

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జీలుగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. రైతు సహకార సంఘాల ద్వారా ప్రతి ఏటా జీలుగ విత్తనాలు రైతులకు విక్రయించేవారు. నేటి వరకు అధికారులు జీలుగ విత్తనాలు మండలంలో ఎక్కడ కూడా అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని రైతులు అంటున్నారు.

నిరుపయోగంగా షాదీఖానా



శిథిలావస్థకు చేరిన షాదీఖానా

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో ముస్లింలు శుభకార్యాలు చేసుకోవాడానికి ప్రభుత్వం నిర్మించిన షాదీఖానా గత 22 ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉంది. 2002లో ప్రభుత్వం బీసీ హాస్టల్ పక్కన ఒక ఎకరం భూమి కేటాయించి అందులో ఎలాంటి సౌకర్యం కల్పించకుండానే అప్పట్లో షాదీఖానా భవనం నిర్మించారు. కనీస నీటి వసతి, కరెంటు, వంటశాలలు, మరుగుదొడ్లు నిర్మించకుండా సగం పనులు చేసి వదిలేశారు. నేటి వరకు ఒక్క శుభకార్యం జరగలేదు ఆనాటి నుంచి నేటి వరకు 22 ఏళ్ల నుంచి మరమ్మతుల కోసం ఒక్క చిల్లిగవ్వ నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి చేరింది. బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, మద్నూర్, జుక్కల్, డోంగ్లీ ఐదు మండలాలకు షాదీఖానా లేకపోవడంతో నిరుపేదలు పెళ్లిళ్లు, శుభకార్యాలు చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఒక ఎకరం స్థలం కేటాయించింది. షాదీఖానా ఆలనాపాలనా చూసుకునే వారు లేక పోవడంతో కొందరు వ్యక్తులు అర ఎకరం స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. భూమి కబ్జాలను తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదు.

పూర్తికావచ్చిన ధాన్యం కొనుగోళ్లు



లింగంపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో యాసంగిలో ఆదివారం వరకు 3,40,718 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు చైర్మన్ దేవేందర్ రెడ్డి తెలిపారు. ఆయన పీఏసీఎస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సంఘం పరిధిలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 2126 మంది రైతుల నుంచి 3.40 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13 సెంటర్లలో కొనుగోలు పూర్తయిందన్నారు. మరో రెండు సెంటర్లలో రెండు, 3 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 80 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. సిబ్బంది ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వకుండా కష్టపడి టార్గెట్ పూర్తి చేసినట్లు తెలిపారు. సీఈవో సందీప్, సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మికం

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారంలో గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటి అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నల్లపోచమ్మ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని ఒడ్డేపల్లి గ్రామంలో ఆదివారం నల్లపోచమ్మ ఆలయానికి ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించారు. గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఎడ్లబండ్లతో పాటు ట్రాక్టర్లను ముస్తాబు చేసి ర్యాలీ తీశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజా పండరి, రాజారాం, బొజ్జం అంజయ్య, విఠల్‌రెడ్డి, గౌస్ , రాములునాయక్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధి కోసం విరాళం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయ అభివృద్ధి కోసం ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన చిలుక సంతోష్, శారద దంపతులు రూ. 51 వేలు విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీధర్ రావు, జేఏలు సంతోష్ కుమార్, లక్ష్మన్ అర్చకులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొత్తాబాది గ్రామంలో జగదాంబ మాత, శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు వైభంగా జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లువేసి, భోగ్‌భండార్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేపట్టారు.

ఎల్లమ్మ ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



దోమకొండ : మండల కేంద్రంలో రేణుకా మాత ఎల్లమ్మ ఆలయం ఉత్సవాలకు సోమవారం నుంచి బుధవారం వరకు ఆలయంలో సేవలు జరగనున్నాయి. సోమవారం గణపతి పూజ పుణ్యావచనం అమ్మవారి అభిషేకాలు నిర్వహిస్తారు. మంగళవారం రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవం అమ్మవారి కోడి బియ్యం సాయంత్రం అమ్మవారికి బోనాలను సమర్పిస్తారు. బుధవారం తిరుగు బోనాలు పుట్ట ఎల్లమ్మ వద్ద పూజా కార్యక్రమాలు ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రేణుక మాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం గౌడ్ తెలిపారు.